E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: HYDERABAD, JANGAON | సంపుటి :01 | సంచిక :63 | సోమవారం 03 ఆగస్టు 2026 | ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ | పేజీలు: 04 | వెల :05/-

## ఇంటర్ అడ్మిషన్లకు గడువు పెంపు



2 లో

- ఆగస్టు 15 వరకు ప్రవేశాలు
- రిజర్వేషన్ నిబంధనలు తప్పనిసరి అమలు
- ప్రవేశ పరీక్షలకు పూర్తిగా నో
- యాంటీ డ్రగ్ డిక్లరేషన్ తప్పనిసరి
- తప్పుడు ప్రకటనలపై కఠిన చర్యలు

## ధరణి అక్రమాలపై సెట్ విచారణ

- భూ అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు
- రీ-సర్వేతో భూ సమస్యలకు చెక్
- రిజిస్ట్రేషన్లలో సింగిల్ ప్లాట్‌ఫామ్
- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ త్వరలో
- పార్టీలో విభేదాల్లేవన్న పొంగులేటి
- 'అన్నదమ్ముల పంచాయతీ' వ్యాఖ్యలు



2 లో

**న్యూస్ డెస్క్, 02 ఆగస్టు (తెలుగు గళం):** తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో చిట్ చాట్ నిర్వహించి రాష్ట్రంలో భూముల సమస్యలు, ధరణి పోర్టల్ అక్రమాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ , కాంగ్రెస్ పార్టీ అంతర్గత అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ , అసైన్డ్ భూముల కేటాయింపుల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపించిన మంత్రి, అసైన్డ్ భూముల విషయంలో త్వరలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుందని తెలిపారు. మెదక్, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లోని అసైన్డ్ భూముల లెక్కలు స్పష్టంగా ఉన్నాయని పేర్కొన్నారు.

ధరణి, భూ భారతి అక్రమాలపై 'సెట్' విచారణ

ధరణి మొదటి టెండర్ నుండి 'భూ భారతి' వరకు జరిగిన భూ లావాదేవీలు, అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (SET) విచారణ జరుపుతుందని మంత్రి వెల్లడించారు. 'భూ భారతి'ని కేవలం నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (NIC)కి మాత్రమే అప్పగించామని, వాళ్లు ఎవరికైనా ఇస్తే ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఫోరెన్సిక్ ఆడిట్ ద్వారా భూ అక్రమాలు పూర్తిగా బయటకు రాలేదని, అందుకే 'సెట్' వేయాల్సి వచ్చిందన్నారు. ప్రోహిబిటెడ్ లిస్ట్‌లో బిఆర్ఎస్ ప్రభుత్వం ఎంత పెట్టింది, కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా చేసింది అనే అంశాలపై సెట్ లెక్కలు తీస్తుందన్నారు.

## 'చరిత్ర ద్రోహులు' అంటూ రాహుల్ హెచ్చరిక

- డీలిమిటేషన్‌పై రాహుల్ ఫైర్
- ప్రతిపక్షాలకు ఐక్యత పిలుపు
- బీజేపీ బిల్లుపై తీవ్ర విమర్శలు
- దక్షిణాది హక్కులపై ఆందోళన
- బిల్లును ఓడించాలని పిలుపు
- డీలిమిటేషన్‌పై రాజకీయ వేడి

2 లో

## ధవలేశ్వరానికి వరద ఉధృతి

- బ్యారేజీ వద్ద 14.90 అడుగుల నీటిమట్టం
- 14.40 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల
- మూడో హెచ్చరికకు 17.75 అడుగులే కీలకం
- భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



2 లో

**న్యూస్ డెస్క్, 02 ఆగస్టు (తెలుగు గళం):** తూర్పుగోదావరి జిల్లాలోని ధవలేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి వరద ఉధృతి కొనసాగుతోంది. బ్యారేజీ వద్ద నీటిమట్టం రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి 14.90 అడుగులకు చేరింది. దీంతో అధికారులు అప్రమత్తంగా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం ధవలేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి 14 లక్షల 40 వేల 381 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. వరద ప్రవాహం కారణంగా బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది.

ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్యారేజీ వద్ద నీటిమట్టం 17.75 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. అయితే ఎగువన ఉన్న భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పడుతున్నందున....

## వచ్చే ఎన్నికలో పోటీ చేయను


- కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు
- అత్యధిక మెజార్టీ ఇస్తేనే నేను పోటీ
- అభివృద్ధిని చూసే ఓట్లు వేయండి
- ఇప్పటికీ అద్దె ఇంట్లోనే ఉంటున్నా
- నల్లగొండ అభివృద్ధే నా లక్ష్యం

2 లో

## కావేరి వివాదంపై కర్ణాటకలో అఖిలపక్ష భేటీ

- రాష్ట్ర ప్రయోజనాలే ప్రథమం: డీకే శివకుమార్
- తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం
- కేంద్రం దృష్టికి రాష్ట్ర ఆందోళనలు
- మాజీ సీఎంలు, కేంద్ర మంత్రుల కీలక చర్చలు
- కావేరి అథారిటీ సమావేశానికి ముందే వ్యూహరచన
- వివాదంపై ఐక్యంగా పోరాడాలని పిలుపు

2 లో



## కేబినెట్‌కు ఫుల్‌స్టాప్?

- విస్తరణకు బ్రేక్ వేసిన రేవంత్?
- మంత్రి ఆశలపై నీళ్లు చల్లిన సంకేతాలు
- ఖాళీ పోస్టులపై సస్పెన్స్ కొనసాగుతోంది
- ఢిల్లీ గ్రీన్ సిగ్నల్ వస్తేనే విస్తరణ
- రెండు బెర్త్‌ల కోసం తీవ్ర పోటీ
- సీఎం వ్యూహం.. నేతల్లో ఉత్కంఠ
- గుట్ట కమిటీపై కాంగ్రెస్‌లో గుసగుసలు
- సీఎం నిర్ణయంపై పార్టీలో చర్చ
- కేబినెట్ కంటే పాలనకే ప్రాధాన్యం

**న్యూస్ డెస్క్, 02 ఆగస్టు (తెలుగు గళం):** రాష్ట్రంలో కేబినెట్ విస్తరణ అంశం ఇక అటకెక్కినట్టేనని ప్రచారం జరుగుతున్నది. ఇప్పుడున్న పరిస్థితుల్లో కొత్త మంత్రుల అవసరంలేదనే వాదన తెరమీదికి వచ్చింది. పాలన అంత సవ్యంగా ఉన్నప్పుడు ఖాళీగా ఉన్న మంత్రి పదవుల భర్తీ ఎందుకు? అని ప్రశ్నిస్తున్నారు. ఈ మధ్య సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉండే ఓ ఇద్దరు లీడర్లు సెక్రెటేరియట్‌లో కనిపించినప్పుడు కేబినెట్ విస్తరణ ఎప్పుడు ఉంటుందని ఆరా తీయగా 'కేబినెట్ విస్తరణ ఎందుకు? ఈ టర్మ్‌లో అసలు విస్తరణనే ఉండకపోవచ్చు' అని ఆసక్తికరమైన విషయాలను వివరించారు.

**ఆ రెండు ఖాళీనే..**

ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డితో కలుపుకుని మొత్తం 16 మంది మంత్రులు ఉన్నారు. మరో రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. ఆ రెండు పదవులను సొంతం చేసుకునేందుకు పలువురు ఎమ్మెల్యేలు హైకమాండ్ వద్ద తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అందరి అభిప్రాయాలు వింటోన్న ఢిల్లీ నేతలు ఇప్పటివరకు విస్తరణ ముహూర్తాన్ని ఫిక్స్ చేయలేదు.

మిగతాది 2 లో..

## డీ-మార్ట్‌కు పోటీగా మీ-మార్ట్

- రూ.52కే బీపీటీ స్టీమ్ రైస్
- 553 మీ-మార్టకు గ్రీన్ సిగ్నల్
- వెయ్యి మీ-మార్ట్లే లక్ష్యం
- 64 వస్తువులు తక్కువ ధరకే
- సామాన్యులకు ధరల ఉపశమనం
- మంత్రి నాదెండ్ల కీలక ప్రకటన



2 లో

**న్యూస్ డెస్క్, 02 ఆగస్టు (తెలుగు గళం):** రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన నిత్యావసర వస్తువులను తక్కువ ధరలకే అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

## 'అంగన్‌వాడీ'లకు మహర్దశ

- రాష్ట్రవ్యాప్తంగా 'తొలిముద్ద' అమలు
- 100 మి.లీ. పాల పంపిణీ
- టీచర్ల ఖాళీల భర్తీ వేగం
- డిజిటల్ హాజరు.. ఫేస్ రికగ్నిషన్
- కార్యకర్తలకు డిప్లొమా కోర్సులు



2 లో

**న్యూస్ డెస్క్, 02 ఆగస్టు (తెలుగు గళం):** రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టనుంది. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతో పాటు అనాథలు, నిరాశ్రయులైన బాలల భవితకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం 'యాక్షన్ ప్లాన్ 2026-27'ను రూపొందించింది. బాల్య వివాహాల నివారణ మొదలుకుని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో హాజరు నమోదు వరకు విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది.


## అసోంలో వరద బీభత్సం



2 లో

- ఐదు గ్రామాల్లో 2 వేల మంది చిక్కు
- చెక్క పడవతో యువకుడి సాహసోపేత రెస్క్యూ
- చిన్నారులు,వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు తరలింపు

## 311 ఏళ్లు పూర్తి చేసుకున్న శ్రీవారి లడ్డూ..!



2 లో

- 1715 నుంచి నిరంతర ప్రసాద సంప్రదాయం
- భక్తికి, విశ్వాసానికి ప్రతీకగా లడ్డూ
- ప్రత్యేక రుచి.. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు
- నాణ్యతను కాపాడుతున్న టీటీడీ

## 'చరిత్ర ద్రోహులు' అంటూ రాహుల్ హెచ్చరిక



**న్యూస్ డెస్క్, 02 ఆగస్టు (తెలుగు గళం):** పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలని చూస్తున్న నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లుపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీసుకురాబోయే ఈ బిల్లుకు ఎలాంటి పరిస్థితుల్లోనూ మద్దతు ఇవ్వకూడదని కాంగ్రెస్ సహా ప్రతిపక్ష, ప్రాంతీయ పార్టీలకు ఆయన సూచనలు చేశారు. ఈ బిల్లుకు మద్దతు తెలిపే ఏ రాజకీయ పార్టీ అయినా, ఏ నేత అయినా భావి తరాలకు, చరిత్రకు ద్రోహులుగా మిగిలిపోతారని రాహుల్ గాంధీ ఘాటుగా వ్యాఖ్యానించారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకోవడానికి బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమైన రాజకీయ కుట్ర అని రాహుల్ గాంధీ విమర్శించారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యతను, ప్రజల ప్రాతినిధ్య హక్కులను దెబ్బతీసేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ఆయుధంగా వాడుకుంటోందని ఆరోపించారు.

చరిత్ర ద్రోహులుగా ముద్ర..

"ఈ బిల్లు వెనుక ఉన్న కుట్రను గ్రహించి ప్రతిపక్షాలు ఒక్కటి కావాలి. ఎలాంటి స్వార్థ ప్రయోజనాల కోసం డీలిమిటేషను మద్దతు ఇచ్చినా, వారు ప్రజల దృష్టిలో, చరిత్ర పుటల్లో 'ద్రోహులు'గానే మిగిలిపోతారు" అని హెచ్చరించారు. కాంగ్రెస్‌తో పాటు దేశంలోని అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీలు సభలో ఈ బిల్లును ఓడించేందుకు కలిసికట్టుగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

## అసోంలో వరద బీభత్సం..

**న్యూస్ డెస్క్, 02 ఆగస్టు (తెలుగు గళం):** అసోంలో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. దిఖో నది వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో నది పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు వరదల దాటికి ఇబ్బంది పడుతున్నారు. దాదాపు ఐదు గ్రామాల్లోని 2వేల మంది ప్రజలు వరదల్లో చిక్కుకున్నారు. వరదల్లో ఓ యువకుడు చేసిన సాహసం చాలా మంది ప్రాణాలను కాపాడింది. 25 శ్రవణ్ కుమార్ అనే యువకుడు సొంతిల్లు, కుటుంబాన్ని కాపాడుకోవడం కంటే ఇతరుల ప్రాణాలు కాపాడేందుకు ప్రాధాన్యత ఇచ్చాడు. నది ఉధృతిని ముందుగానే గుర్తించిన యువకుడు ఎలాంటి రెస్క్యూ శిక్షణ, మోటార్ బోట్ లేకుండా కేవలం చెక్క పడవతో సహాయక చర్యలు చేపట్టేందుకు రంగంలోకి దిగాడు.

మునిగిపోతున్న ఇళ్లు, పైకప్పులపై చిక్కుకున్న చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలను సురక్షిత ప్రాంతాలకు తరలించాడు. ఉదయం నుండి మరుసటి రోజు వరకు విశ్రాంతి లేకుండా శ్రవణ్ కుమార్ సాహసోపేతంగా సహాయక చర్యలు చేపట్టాడు. దీంతో యువకుడిపై ప్రశంసలు కురుస్తున్నాయి. చాలా మంది కష్టం వచ్చిందంటే పారిపోతుంటారు. కానీ శ్రవణ్ కుమార్ ప్రాణాలు పోయే ప్రమాం పొంచి ఉన్నప్పటికీ లెక్క చేయకుండా ప్రాణాలకు తెగించి తన చుట్టుపక్కల వారిని రక్షించాడు.

## డీ-మార్ట్‌కు పోటీగా మీ-మార్ట్

మొదటి పేజీ తరువాయి

పెరుగుతున్న ధరల నుంచి సామాన్యులకు ఊరట కల్పించేందుకు ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుందని ఆయన వెల్లడించారు. 150 రైతు బజార్లలో రూ.52 కే బీపీటీ స్టీమ్ రైస్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 150 రైతు బజార్లలో నాణ్యమైన బీపీటీ స్టీమ్ రైస్‌ను విక్రయానికి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మంత్రి తెలిపారు.

మార్కెట్‌లో వీటి ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని కిలో బియ్యాన్ని కేవలం రూ.52లకే సబ్సిడీ ధరపై అందిస్తోందన్నారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం కూడా పూర్తి స్థాయి సహకారం అందిస్తోందని చెప్పారు. డీ-మార్ట్‌కు పోటీగా 'మీ-మార్ట్'లు ప్రజలకు తక్కువ ధరలకే నిత్యావసర వస్తువులు సరఫరా చేసేందుకు ప్రైవేట్ దిగ్గజం డీ మార్ట్ కు పోటీగా 'మీ-మార్ట్'కాన్సెప్ట్‌ను ప్రవేశపెడుతున్నట్లు మంత్రి ప్రకటించారు.

రాష్ట్రంలో ప్రారంభ దశగా 553 మినీ మీ-మార్ట్ లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మార్ట్‌ల ద్వారా 64 రకాల నిత్యావసర వస్తువులను బహిరంగ మార్కెట్ కంటే చాలా తక్కువ ధరలకే విక్రయిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,000 మినీ మీ-మార్ట ఏర్పాటు కోసం ఇప్పటికే ఒప్పందాలు పూర్తయ్యాయని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. సామాన్యుడి ఆర్థిక భారాన్ని తగ్గిస్తూ, నాణ్యమైన వస్తువులను నేరుగా ప్రజల వద్దకే చేర్చడమే ధ్యేయంగా పౌర సరఫరాల శాఖ శ్రమిస్తోందని ఆయన స్పష్టం చేశారు.


## కావేరి వివాదంపై కర్ణాటకలో అఖిలపక్ష భేటీ



**న్యూస్ డెస్క్, 02 ఆగస్టు (తెలుగు గళం):** కావేరీ నదీ జలాల వివాదంపై కర్ణాటక ముఖ్యమంత్రి నివాస కార్యాలయం 'కృష్ణ'లో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల సంక్షేమం తమకు రాజకీయం కంటే చాలా ముఖ్యమైనవని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిన ప్రతీసారి కర్ణాటకలోని రాజకీయ పార్టీలన్నీ విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా నిలిచిన చరిత్ర ఉందని ఆయన గుర్తు చేశారు. కావేరి నీటి పంపిణీలో తాగునీటి అవసరాలకే తమ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.

కావేరి నీటి నిర్వహణ అథారిటీ మరియు రెగ్యులేటరీ కమిటీ సమావేశాలకు ముందు కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, ప్రహ్లాద్ జోషి, వి. సోమన్నలతో పాటు మాజీ ముఖ్యమంత్రులు బసవరాజ్ బొమ్మై, జగదీష్ శెట్టర్‌లతో మాట్లాడి రాష్ట్ర ఆందోళనలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. ఈ అఖిలపక్ష సమావేశానికి మాజీ ముఖ్యమంత్రులు సిద్ధరామయ్య, బి.ఎస్. యడియూరప్ప, హెచ్.డి. కుమారస్వామి, వీరప్ప మొయిలీ, సదానంద గౌడలతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు, ప్రతిపక్ష నేతలు హాజరై న్యాయపరమైన, పరిపాలనా పరమైన చర్యలపై విస్తృతంగా చర్చించారు.

## ఏపీ ప్రభుత్వం కీలక అడుగులు..
## ఆస్ట్రేలియాతో నాలుగు ఎంవోయూలు



**న్యూస్ డెస్క్, 02 ఆగస్టు (తెలుగు గళం):** రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. విదేశీ పర్యటన చేపట్టి పెట్టుబడులు రాబడుతోంది. ఇటీవల మంత్రి నారా లోకేశ్ చేసిన పర్యటనతో ఫలితం దక్కింది. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామి అయ్యేందుకు ఆస్ట్రేలియా బృందం తాజాగా ముందుకు వచ్చింది. దీంతో నాలుగు కీలక ఒప్పందాలు కుదిరాయి. క్లీన్ ఎనర్జీ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, విద్య, నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన ఏపీ ప్రభుత్వం, ఆస్ట్రేలియా ప్రతినిధుల మధ్య ఎంవోయూలు కుదిరాయి. దీంతో మంత్రి లోకేశ్, ఆస్ట్రేలియా మంత్రి హిల్ ఒప్పంద సంతకాలు చేసుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా విశాఖలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ట్రాన్సిషన్, ఐఐటీ తిరుపతి, సిడ్నీకి చెందిన యూనివర్సిటీ ఆఫ్ న్యూ వేల్స్ సంయుక్తంగా అలాగే ఐఐటీ తిరుపతిలో సోలార్ తయారీ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## వచ్చే ఎన్నికల్లో నేను పోటీ చేయను



**న్యూస్ డెస్క్, 02 ఆగస్టు (తెలుగు గళం):** రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఆయన నల్లగొండలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. తన నియోజకవర్గ ప్రజలకు ఓ కీలక షరతు విధించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తనను రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని నల్లగొండ ప్రజలు మాట ఇస్తేనే తాను పోటీ బరిలో ఉంటానని స్పష్టం చేశారు. ఒకవేళ ప్రజల నుంచి ఆ విధమైన స్పష్టమైన హామీ లేకపోతే అసలు ఎన్నికల ప్రక్రియ నుంచే తప్పుకుంటానని ప్రకటించి రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు తెరలేపారు. ఎన్నికల సమయంలో తాను స్వయంగా ప్రచారానికి రాకపోయినా, ఇప్పటి వరకు నల్లగొండ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమాన్ని చూసి ఓట్లు వేయాలని ఆయన ప్రజలకు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా తన రాజకీయ జీవితం, సొంత ఆస్తుల గురించి మాట్లాడుతూ.. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. సుదీర్ఘకాలంగా శాసనసభ్యుడిగా, పలుమార్లు మంత్రిగా సేవలందించినప్పటికీ తనకు ఎలాంటి సొంత ఇల్లు గానీ, అదనపు ఆస్తులు గానీ లేవని చెప్పారు. ఇప్పటికీ తాను హైదరాబాద్‌లో అద్దె ఇంట్లోనే నివాసముంటున్నానని, తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమి తప్ప తాను స్వయంగా సంపాదించిన ఆస్తులేవీ లేవని వెల్లడించారు. నల్లగొండ అభివృద్ధే తన ధ్యేయమని, పదవులు ఉన్నా లేకపోయినా ప్రజల కోసమే పనిచేస్తానని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

## 'అంగన్‌వాడీ'లకు మహర్దశ..

మొదటి పేజీ తరువాయి

ప్రస్తుతం ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా విజయవంతంగా అమలవుతున్న 'తొలిముద్ద' అల్పాహార పథకాన్ని ఇకపై రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నారు. అలాగే ములుగు జిల్లాలో అమలవుతున్న ప్రీస్కూల్ పిల్లలకు 100 మి.లీ. పాల పంపిణీ కార్యక్రమాన్ని కూడా రాష్ట్రమంతటా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాది అన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఆగస్టు 15 నాటికి ముఖ గుర్తింపు, డిజిటల్ హాజరు విధానాన్ని అన్ని కేంద్రాల్లో అమల్లోకి తీసుకురావడానికి అధికారులు చర్యలు చేపట్టారు.


డిప్లొమా కోర్సులు..

అంగన్‌వాడీ కార్యకర్తలందరికీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ద్వారా డిప్లొమా సర్టిఫికెట్ కోర్సు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే రాష్ట్రంలోని అన్ని కేంద్రాలకు 19 రకాల వంటపాత్రలు, బల్లలు, బెంచ్‌లు, యూనిఫాం చీరలు పంపిణీ చేయనున్నారు. పాఠశాలలతో అంగన్‌వాడీ కేంద్రాల అనుసంధానం, శిశువిహార్‌ల ఆధునీకరణ ఈ ఏడాది వేగవంతం కానుంది. అనాథ పిల్లల సంరక్షణ, రక్షణ, పునరావాసం కోసం రాష్ట్ర ప్రభుత్వం సరికొత్తగా ఆర్ఫన్ పాలసీని తీసుకురానుంది. ఎన్జీవోల ఆధ్వర్యంలో నడుస్తున్న కనీసం 10 చైల్డ్‌కేర్ ఇన్‌స్టిట్యూషన్లను ప్రభుత్వ నిర్వహణలోకి తీసుకురానున్నారు. అలాగే చట్టబద్ధమైన, పారదర్శకమైన దత్తత ప్రక్రియ ద్వారా ఈ ఏడాది సుమారు 350 మంది పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువైనల్ జస్టిస్ బోర్డులలోని 246 ఖాళీలను రాబోయే 2 నెలల్లో భర్తీ చేయనున్నారు.

## కేబినెట్‌కు ఫుల్‌స్టాప్?

మొదటి పేజీ తరువాయి

ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉండే ఓ ఇద్దరు లీడర్లు కేబినెట్ విస్తరణపై అసలు విషయాన్ని వివరించారు. 'ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో కేబినెట్ విస్తరణ ఎందుకు? అనే అభిప్రాయంలో సీఎం ఉన్నారు. అడ్మినిస్ట్రేషన్ సాఫీగా జరుగుతోంది. సీఎం ఆలోచన చూస్తుంటే ఈ టర్మ్‌లో విస్తరణ ఉండకపోవచ్చని అనిపిస్తున్నది. ఒకవేళ అధిష్టానం ఆదేశిస్తే మాత్రం ఖాళీగా ఉన్న రెండు పదవులను భర్తీ చేస్తరు. లేకపోతే విస్తరణ అంశం అటకెక్కినట్టే' అని వివరించారు.



'గుట్ట'పై అనవసర వివాదం

యాదగిరి గుట్ట పాలక మండలి ఏర్పాటుపై పార్టీలో రాద్ధాంతం జరుగుతున్నది. పార్టీ లీడర్లను సంప్రదించని తరువాతే కమిటీ ప్రకటిస్తే బాగుండేదని కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇంకొందరు నేరుగా అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. యాదగిరి గుట్ట సీఎం శాఖ పరిధిలో ఉందని, ఆ విషయంలో ఆయన ఎవరిని సంప్రదించాల్సిన అవసరంలేదని సదరు లీడర్లు అభిప్రాయపడ్డారు. 'యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీ సీఎం పరిధిలోని మున్సిపల్ శాఖల అంతర్భాగంగా ఉంది. ఆ శాఖ మంత్రిగా టెంపుల్ కమిటీలో ఎవరిని నియమించాలో రేవంత్ రెడ్డికి అధికారం ఉంది. దీనిపై అనవసరంగా వివాదం చేస్తున్నారు' అని సీఎంకు సన్నిహితంగా ఉండే సదరు లీడర్లు కామెంట్ చేశారు.

## ఇంటర్ అడ్మిషన్లకు గడువు పెంపు



**న్యూస్ డెస్క్, 02 ఆగస్టు (తెలుగు గళం):** రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ కాలేజీల్లో 2026-27 విద్యాసంవత్సరానికి గాను ఫస్టియర్ ప్రవేశాల గడువును ఆగస్టు 15 వరకు పొడిగిస్తున్నట్లు ఇంటర్ బోర్డు శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్, రెసిడెన్షియల్, ఇతర జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రవేశాల్లో ప్రభుత్వం నిర్దేశించిన రిజర్వేషన్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, ప్రత్యేక మహిళా కాలేజీలు లేని చోట ప్రతి కేటగిరీలో 33.33 శాతం (1/3 వంతు) సీట్లను బాలికలకు కేటాయించాలని తెలిపింది. పదో తరగతి జీపీఏ, సబ్జెక్టు గ్రేడ్ పాయింట్ల ఆధారంగానే ప్రవేశాలు కల్పించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ కాలేజీలు ప్రవేశ పరీక్షలు నిర్వహించకూడదని స్పష్టం చేసింది. ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు తమ ప్రవేశ సమయాల్లో గుర్తింపు పొందిన ప్రామాణిక పత్రాలను, ఆధార్ సంఖ్యను సమర్పించడం తప్పనిసరి అని పేర్కొంది.

మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రవేశాల సమయంలో విద్యార్థులు, తల్లిదండ్రుల నుండి తప్పనిసరిగా యాంటీ-డ్రగ్ డిక్లరేషన్ తీసుకోవాలని స్పష్టం చేసింది. విదేశీ లేదా ఒసీఐ విద్యార్థులు ప్రవేశం పొందిన 24 గంటల లోపు సంబంధిత సమాచారాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌కు అందించాలి. అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ కాలేజీలు బోర్డు అనుమతించిన సెక్షన్లు, గరిష్టంగా ప్రతి సెక్షన్‌కు 88 మంది విద్యార్థులకు మాత్రమే ప్రవేశాలు ఇవ్వాలని తెలిపింది. విద్యార్థులను ఆకర్షించేలా తప్పుడు ప్రకటనలు ఇస్తే కఠిన చర్యలు ఉంటాయని బోర్డు హెచ్చరించింది. విద్యార్థులు కేవలం ఇంటర్మీడియట్ బోర్డు గుర్తింపు పొందిన కాలేజీల్లోనే ప్రవేశాలు పొందాలని, గుర్తింపు పొందిన కాలేజీల జాబితాను అధికారిక వెబ్‌సైట్లు acadtgbie.cgg.gov.in, tgbienew.cgg.gov.in లలో పరిశీలించవచ్చని తెలిపింది.

## ధరణి అక్రమాలపై సెట్ విచారణ

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రోహిబిటెడ్ లిస్ట్‌లోని ఒక్క భూమిని కూడా రిజిస్ట్రేషన్ చేయలేదని తెలిపారు. భూ అక్రమాల్లో ఎంఆర్‌ఓల పాత్ర ఎక్కువగా ఉందని, కొందరి వల్ల తెలిసి జరిగితే మరికొందరి వల్ల తెలియక జరిగాయని అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో రీ-సర్వే చేపట్టడం ద్వారా 90 శాతానికి పైగా భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయన్నారు.

అవినీతి కట్టడికి చర్యలు.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ

రెవెన్యూ శాఖలో అవినీతిని కట్టడి చేసేందుకు సర్వప్రయత్నాలు చేస్తున్నానని మంత్రి చెప్పారు. సబ్ రిజిస్ట్రార్ల విచక్షణాధికారాలను కట్ చేస్తేనే అవినీతికి అడ్డుకట్ట వేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని, మరో నెల రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా సింగిల్ ప్లాట్‌ఫామ్ కిందికే రిజిస్ట్రేషన్ల వ్యవస్థ రాబోతోందని ప్రకటించారు. ఇక గత ప్రభుత్వం నిర్మించిన , ఇచ్చిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను రాబోయే రెండు నుండి మూడు నెలల్లో అర్హులకు పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే యాదాద్రి భువనగిరి జిల్లా వాసాలమర్రి గ్రామంలో నిర్మించిన ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాన్ని ఆగస్టు 15వ తేదీ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

పార్టీ-ప్రభుత్వం మధ్య అనుబంధం.. 'అన్నదమ్ముల పంచాయతీ'

కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి , గాంధీ భవన్ వర్గాలకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఒక మహా సముద్రమని, అందులో చిన్న చిన్న సమస్యలు రావడం సహజమని పేర్కొన్నారు. పార్టీకి, ప్రభుత్వానికి మధ్య ఉన్నది కేవలం అన్నదమ్ముల పంచాయతీ మాత్రమేనని, ఒక్కొక్కరికి ఒక్కో అభిప్రాయం ఉండటం సహజమని, దాన్ని విభేదాలు అనడం సరికాదన్నారు. కో-ఆర్డినేషన్ కమిటీ మొదటి సమావేశం కాబట్టే ఢిల్లీలో జరిగిందని వివరణ ఇచ్చారు. తమ అంతర్గత పంచాయతీలోకి ఇతరులు దూరి రాజకీయాలు చేస్తే వారికే నష్టమని హెచ్చరించారు.

## 311 ఏళ్లు పూర్తి చేసుకున్న తిరుమల శ్రీవారి లడ్డూ..!



**న్యూస్ డెస్క్, 02 ఆగస్టు (తెలుగు గళం):** శ్రీ వేంకటేశ్వర స్వామివారి ప్రసాదాల్లో అత్యంత ప్రసిద్ధి శ్రీవారి 'లడ్డూ'. నేటితో (ఆగస్టు 2) ఈ లడ్డూకు 311 ఏళ్లను పూర్తి చేసుకుంది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల ఆరాధన పొందిన ఈ పవిత్ర ప్రసాదం కేవలం ఒక ప్రసాదం, తీపి పదార్థం మాత్రమే అని కాకుండా.. శ్రీవారిపై భక్తి, విశ్వాసానికి ప్రతీకగా భావిస్తారు.

చారిత్రక ఆధారాల ప్రకారం.. 1715 ఆగస్టు 2న తిరుమల ఆలయంలో శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేయడం ప్రారంభమైంది. అప్పటి నుంచి ప్రతి రోజు శ్రీవారికి నైవేద్యంగా సమర్పించిన అనంతరం భక్తులకు ఈ లడ్డూను ప్రసాదంగా అందిస్తున్నారు. ఈ ఏడాదితో లడ్డూ ప్రసాదం 311 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది.

తిరుమలలో ప్రతిరోజూ నిర్వహించే శ్రీనివాస కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అందించే ప్రధాన ప్రసాదాల్లో శ్రీవారి లడ్డూ ఒకటి. శ్రీవారి దర్శనం అనంతరం లడ్డూ ప్రసాదాన్ని స్వీకరించడం భక్తులు అత్యంత పవిత్రంగా భావిస్తారు. శెనగపిండి, నెయ్యి, చక్కెర, జీడిపప్పు, ఎండుద్రాక్ష, యాలకులు వంటి నాణ్యమైన పదార్థాలతో ప్రత్యేక పద్ధతిలో తయారయ్యే శ్రీవారి లడ్డూ తన ప్రత్యేక రుచి, సువాసనతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. తిరుమలకు వచ్చే విదేశీ భక్తులు సైతం ఈ ప్రసాదాన్ని ఆసక్తిగా తీసుకెళ్తుంటారు.

శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని భక్తులు దైవానుగ్రహంగా భావిస్తారు. శ్రీవారి ఆశీస్సులు లభించాయని భావిస్తూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఈ ప్రసాదాన్ని పంచుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది. శ్రీవారి లడ్డూ తయారీ విధానం, నాణ్యత, రుచి వంటి అంశాలను తిరుమల తిరుపతి దేవస్థానం తరతరాలుగా సంరక్షిస్తూ వస్తోంది. సాంప్రదాయ పద్ధతులను పాటిస్తూ కోట్లాది మంది భక్తులకు ప్రతిరోజూ ఈ ప్రసాదాన్ని అందిస్తోంది.

## ధవలేశ్వరానికి వరద ఉధృతి



**న్యూస్ డెస్క్, 02 ఆగస్టు (తెలుగు గళం):** తూర్పుగోదావరి జిల్లాలోని ధవలేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి వరద ఉధృతి కొనసాగుతోంది. బ్యారేజీ వద్ద నీటిమట్టం రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి 14.90 అడుగులకు చేరింది. దీంతో అధికారులు అప్రమత్తంగా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం ధవలేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి 14 లక్షల 40 వేల 381 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. వరద ప్రవాహం కారణంగా బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది.

ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్యారేజీ వద్ద నీటిమట్టం 17.75 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. అయితే ఎగువన ఉన్న భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పడుతున్నందున, ధవలేశ్వరం వద్ద వరద మట్టం స్వల్పంగా పెరిగిన తర్వాత క్రమంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం తగ్గుముఖం పట్టింది. 2 గంటల నుంచి 4 గంటల వరకు 0.5 అడుగులు తగ్గింది. మీటర్లలో 0.27 మీటర్లు తగ్గింది. వాతావరణం మేఘావృతం నుంచి వర్షం, అనంతరం జల్లులుగా మారింది. ప్రస్తుతం నీటి మట్టం ప్రమాద స్థాయి కంటే తక్కువగా ఉండి తగ్గుతున్న ధోరణిలో ఉంది. భద్రాచలం వద్ద గోదావరి వరద ప్రభావం క్రమంగా తగ్గుతోంది. అయితే దిగువ ప్రాంతాలపై ప్రభావం కొనసాగవచ్చునని అధికారులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.


న్యూస్ డెస్క్, 02 ఆగస్టు (తెలుగు గళం): తూర్పుగోదావరి జిల్లాలోని ధవలేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి వరద ఉధృతి కొనసాగుతోంది. బ్యారేజీ వద్ద నీటిమట్టం రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి 14.90 అడుగులకు చేరింది. దీంతో అధికారులు అప్రమత్తంగా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం ధవలేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి 14 లక్షల 40 వేల 381 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. వరద ప్రవాహం కారణంగా బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది.

ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్యారేజీ వద్ద నీటిమట్టం 17.75 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. అయితే ఎగువన ఉన్న భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పడుతున్నందున, ధవలేశ్వరం వద్ద వరద మట్టం స్వల్పంగా పెరిగిన తర్వాత క్రమంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం తగ్గుముఖం పట్టింది. 2 గంటల నుంచి 4 గంటల వరకు 0.5 అడుగులు తగ్గింది. మీటర్లలో 0.27 మీటర్లు తగ్గింది. వాతావరణం మేఘావృతం నుంచి వర్షం, అనంతరం జల్లులుగా మారింది. ప్రస్తుతం నీటి మట్టం ప్రమాద స్థాయి కంటే తక్కువగా ఉండి తగ్గుతున్న ధోరణిలో ఉంది. భద్రాచలం వద్ద గోదావరి వరద ప్రభావం క్రమంగా తగ్గుతోంది. అయితే దిగువ ప్రాంతాలపై ప్రభావం కొనసాగవచ్చునని అధికారులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

# భూమిలోకి కుంగిపోయిన ఓడల బావి:రైతుకు భారీ నష్టం

## కొత్తపల్లి గోరి మండలం సుల్తాన్పూర్ గ్రామంలో చోటు చేసుకున్న ఘటన



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి మండలం సుల్తాన్‌పూర్ గ్రామంలో ఓడల బావి ఒక్కసారిగా భూమిలోకి కుంగిపోయి పూడిపోవడంతో రైతుకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లింది.గ్రామానికి చెందిన రైతు కొండా చందర్ తనకు ఉన్న 3 ఎకరాల వ్యవసాయ భూమిలో సాగు నీటి కోసం సుమారు 8 సంవత్సరాల క్రితం రూ.15 లక్షల వ్యయంతో సొంతంగా ఓడల బావిని తవ్వించుకున్నారు.ఆదివారం తెల్లవారుజామున పొలంలో దుక్కి దున్నే పనుల కోసం మోటార్ అమర్చేందుకు వెళ్లిన సమయంలో బావి ఉన్న ప్రదేశం ఒక్కసారిగా లోపలికి కుంగిపోయి పూర్తిగా కనిపించకుండా పోయింది.ఎంతో కష్టపడి నిర్మించుకున్న బావి కళ్లముందే భూమిలో కలిసిపోవడంతో రైతు తీవ్ర వేదనకు గురయ్యారు. సంబంధిత రెవెన్యూ, వ్యవసాయ అధికారులు వెంటనే స్పందించి స్థలాన్ని పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని,ప్రభుత్వం తరఫున తగిన పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నారు.



# ఐలాపురం ఏజెన్సీ గ్రామ రహదారికి ఎప్పుడు మోక్షం..?

- ఏజెన్సీ ప్రజలకు రహదారి నరకయాతన
- ప్రాణాలకు తెగించి ప్రయాణిస్తున్న గ్రామస్తులు
- వర్షం వస్తే ప్రపంచానికి దూరమవుతున్న ఐలాపురం





**తెలుగు గళం కన్నాయిగూడెం, ములుగు:**

ములుగు జిల్లా, కన్నాయిగూడెం మండలం, ఐలాపురం ఏజెన్సీ గ్రామ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రధాన రహదారి ఇప్పటికీ అధ్వాన్న స్థితిలోనే ఉంది. ప్రతి వర్షాకాలం వస్తే ఈ రహదారి బురదమయంగా మారి, భారీ గుంతలు, నీటి నిల్వలతో పూర్తిగా దెబ్బతింటోంది. గ్రామానికి వెళ్లే ఏకైక దారి ఇదే కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ప్రాణాలను పణంగా పెట్టాల్సి వస్తోంది. గర్భిణీలు, వృద్ధులు, అత్యవసర వైద్యం అవసరమైన రోగులు ఆసుపత్రులకు చేరుకోవడం కష్టసాధ్యంగా మారింది. ద్విచక్ర వాహనాలు బురదలో ఇరుక్కుపోవడం, ప్రజలు జారి పడడం, ప్రమాదాలు జరగడం నిత్యకృత్యంగా మారింది. వర్షం కురిసిన ప్రతిసారీ ఈ రహదారి చెరువును తలపిస్తూ ప్రయాణానికి పూర్తిగా అనర్హంగా మారుతోంది. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు కూడా గ్రామానికి చేరుకోలేని దుస్థితి నెలకొంది. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా, ఏజెన్సీ ప్రాంత ప్రజలకు కనీస రహదారి సౌకర్యం కూడా కల్పించలేకపోవడం బాధాకరం. ప్రతి ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు ఐలాపురం రహదారి నిర్మాణంపై హామీలు ఇస్తున్నప్పటికీ, ఎన్నికలు ముగిసిన తర్వాత ఆ హామీలు కాగితాలకే పరిమితమవుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నోసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం కనిపించలేదని అంటున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వర్షాకాలంలో గ్రామ ప్రజలు ప్రపంచానికి దూరమైనట్లే అవుతున్నారు. అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకునే ఈ రోజుల్లో కూడా ఐలాపురం వంటి ఏజెన్సీ గ్రామాలు కనీస రహదారి సౌకర్యం కోసం ఎదురు చూడాల్సి రావడం ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. అందువల్ల జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ఐలాపురం గ్రామ రహదారిని శాశ్వతంగా నిర్మించేలా ప్రత్యేక నిధులు మంజూరు చేసి అత్యవసర చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈసారి అయినా ఐలాపురం రహదారికి మోక్షం కల్పించాలని ప్రజలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు

# భక్తిశ్రద్ధలతో పోచమ్మ తల్లి బోనాల మహోత్సవం: సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు



**తెలుగు గళం న్యూస్ సిద్దిపేట కోహెడ**

సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలో నాయిబ్రాహ్మణ,పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో శ్రీ పోచమ్మ తల్లి బోనాల మహోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు.ఈ వేడుకలకు ప్రముఖ సామాజిక కార్యకర్త,ఎమ్మెల్సీ పోటీదారు పిడిశెట్టి రాజు ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ,పద్మశాలి సంఘాల అధ్యక్షులు,ప్రతినిధులు,ప్రభుత్వ ఉద్యోగి తూముల రమేష్,గడ్డం వెంకటేష్,సంతోష్,కుల బాంధవులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గొర్రెలు,మేకల పంపిణీ పథకాన్ని వెంటనే ప్రారంభించాలి

## :ఆప్ జిల్లా కన్వీనర్ నాగుల అరవింద్



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి టేకుమట్ల**

రాష్ట్రంలో గొర్రెలు,మేకల పెంపకందారులను ఆర్థికంగా ఆదుకోవడానికి నిలిచిపోయిన పంపిణీ పథకాన్ని తగిన మార్పులతో వెంటనే పునఃప్రారంభించాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ నాగుల అరవింద్ డిమాండ్ చేశారు.టేకుమట్ల మండల పరిధిలోని పలు గ్రామాల్లో గొర్రెలు,మేకల కాపరుల వద్దకు వెళ్లి వారి సమస్యలను శనివారం ఆయన అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో అత్యంత వెనుకబడిన గొర్రెల పెంపకందారులకు ఆర్థిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.గతంలో నిలిచిపోయిన పథకాన్ని సరికొత్త నిబంధనలతో ప్రవేశపెట్టి అర్హులందరికీ న్యాయం చేయాలని కోరారు.అలాగే పశువైద్య అధికారులు ఉచితంగా వేయాల్సిన టీకాలు,ఇవ్వాల్సిన మందులకు డబ్బులు వసూలు చేస్తున్నారని,అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఉచిత టీకాలు,మందులు సకాలంలో అందేలా జిల్లా వ్యాప్తంగా సమీక్ష నిర్వహించి ప్రత్యేక కమిటీ వేయాలన్నారు.వెంటనే పథకాన్ని ప్రారంభించకపోతే జిల్లా స్థాయిలో కాపరులందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆప్ జిల్లా కోశాధికారి వాసాల శ్రావణ్ కుమార్,పలువురు గొర్రెల పెంపకందారులు పాల్గొన్నారు



# భూపాలపల్లి జిల్లా 'ట్రెస్సా' నూతన అధ్యక్షుడిగా రాజ్ ప్రకాష్,ప్రధాన కార్యదర్శిగా రజాక్



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెస్సా) జయశంకర్ భూపాలపల్లి జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా మేకల రాజ్ ప్రకాష్,ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ అబ్దుల్ రజాక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు .హనుమకొండలోని రెవెన్యూ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర,ఉమ్మడి జిల్లా నాయకుల సమక్షంలో ఈ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.ఈ ఎన్నికల అధికారులుగా రాష్ట్ర యూనియన్ నాయకులు మన్నే ప్రభాకర్,నారాయణ రెడ్డి,ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాజు కుమార్ వ్యవహరించగా, పర్యవేక్షకులుగా ములుగు తహసీల్దార్ విజయ భాస్కర్, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణాధికారి మన్నే ప్రభాకర్ మాట్లాడుతూ.. నూతన కార్యవర్గం జిల్లా స్థాయిలో రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీలో అసోసియేట్ ప్రెసిడెంట్లుగా ఎస్. కె. అబ్బాస్, ఏ.నాగరాజు, జె.నరేష్ కుమార్, టి.సాగర్, సువర్ణ, కోశాధికారిగా పి.రాజయ్య, సహాయ కార్యదర్శులు, సంఘటనా కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా నాయకులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# ఐటీడీఏ ఏటూరునాగారం వెనుక రోడ్డు స్పీడ్ బ్రేకర్ ప్రాణాలు తీస్తుందా..?

## స్పీడ్ బ్రేకర్‌పై ఇరుక్కుపోయిన లారీ
## ఒక ప్రాణం బలైనా అధికారులకు చలనం లేదా..?



**తెలుగు గళం ఏటూరునాగారం:**

ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయం వెనుక రోడ్డుపై నిర్మించిన స్పీడ్ బ్రేకర్ స్థానిక ప్రజలకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. శాస్త్రీయ ప్రమాణాలు పాటించకుండా నిర్మించిన ఈ స్పీడ్ బ్రేకర్ కారణంగా భారీ వాహనాలు తరచూ ఇరుక్కుపోతుండటంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. తాజాగా ఓ లారీ స్పీడ్ బ్రేకర్‌పై ఇరుక్కుపోవడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. స్థానికుల కథనం ప్రకారం, ఇదే స్పీడ్ బ్రేకర్ కారణంగా గతంలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఘటన జరిగినప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ప్రతిరోజూ విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసర సేవల వాహనాలు, అంబులెన్సులు ఈ మార్గంలో ప్రయాణిస్తున్నప్పటికీ సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యం కొనసాగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాలు ఇరుక్కుపోవడంతో గంటల పాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు కూడా నిలిచిపోతే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకరంగా మారిన ఈ స్పీడ్ బ్రేకర్‌ను వెంటనే తొలగించాలా లేదా రహదారి ప్రమాణాలకు అనుగుణంగా పునర్నిర్మించాలా అనే దానిపై అధికారులు తక్షణ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాల కంటే నిర్లక్ష్యమే ముఖ్యమా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మరిన్ని ప్రమాదాలు, ప్రాణనష్టాలు జరగకముందే జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, రోడ్లు--భవనాల శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే నిజమైన పాలన అని స్థానికులు పేర్కొంటున్నారు.

# ప్రతి ఆదివాసి గూడెంలో ఆగస్టు 9న ఆకుపచ్చ జెండా ఎగరాలి

- ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం -- ఇర్ప అరుణ
- ఆదివాసుల ఐక్యతకు ఆగస్టు 9 వేదిక కావాలి




**తెలుగు గళం మంగపేట ములుగు:**

ఆగస్టు 9న జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ప్రతి ఆదివాసి గూడెం, ప్రతి గ్రామంలో ఆకుపచ్చ జెండా ఎగరవేసి ఘనంగా నిర్వహించాలని మన్యసీమ పరిరక్షణ సమితి మహిళ జిల్లా అధ్యక్షురాలు ఇరుప అరుణ పిలుపునిచ్చారు. మంగపేట మండల కేంద్రంలోని మన్యసీమ భవన్‌లో మండల మహిళా ప్రధాన కార్యదర్శి పూసం సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఆదివాసుల హక్కులు, సంస్కృతి, భాష, సంప్రదాయాలు, భూమి--అటవీ హక్కుల పరిరక్షణకు ప్రతీక అని అన్నారు. ఐక్యరాజ్యసమితి ప్రకటించిన ఈ దినోత్సవాన్ని ప్రతి ఆదివాసి ఆత్మగౌరవ దినంగా భావించి విజయవంతం చేయాలని కోరారు. మంగపేట మండలంలోని ప్రతి ఆదివాసి గ్రామం నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు తోలేం సౌమ్య, మండల మహిళా ప్రధాన కార్యదర్శి పూసం సావిత్రి, వాగబోయిన లావణ్య, కురసం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా బీరు--డిస్టిలరీస్ కార్మికుల ఐక్య పోరాటాలను బలోపేతం చేయాలి

## - సీఐటీయూ

- అక్టోబర్ 8న కోర్కెల దినం
- ఆగస్టు 10న జైల్ భరో విజయవంతం చేయాలని సాయిబాబు పిలుపు






**తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు 2**

దేశవ్యాప్తంగా బీరు, డిస్టిలరీస్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల ఐక్య పోరాటాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం. సాయిబాబు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఆల్ ఇండియా కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ బ్రూవరీస్ అండ్ డిస్టిలరీస్ జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సదస్సుకు సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అధ్యక్షత వహించారు.దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్న సీఐటీయూ అనుబంధ యూనియన్ల మధ్య సమన్వయాన్ని పెంపొందించి, వేతనాలు, ఉద్యోగ భద్రత, కార్మిక హక్కులు, సంక్షేమ అంశాలపై దేశవ్యాప్తంగా ఐక్య ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఉందని సాయిబాబు పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తూ రాజ్యాంగ, ప్రజాస్వామ్య, లౌకిక, సమాఖ్య విలువలను బలహీనపరుస్తోందని ఆయన విమర్శించారు.ప్రజల సమస్యలను పరిష్కరించే వేదికగా ఉండాల్సిన పార్లమెంట్ కార్పొరేట్ ప్రయోజనాలకు అనుకూల చట్టాలు చేసే కేంద్రంగా మారిందని ఆరోపించారు. అటవీ, గనులు, కార్మిక రంగాలకు సంబంధించిన చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ధరల పెరుగుదల, నిరుద్యోగం, పేదరికం, ఆకలి వంటి సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, కనీస వేతనాల పెంపు, ఉపాధి కల్పన, సామాజిక భద్రత వంటి అంశాలను నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. ఫ్యాక్టరీలు, నిర్మాణ రంగంలో కార్మికుల ప్రమాదాలు, మరణాలు పెరుగుతున్నప్పటికీ పనిస్థలాల్లో భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, వలస కార్మికుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, పుచ్చలపల్లి సుందరయ్య, బి.టి. రణదివే వంటి మహనీయుల పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.సదస్సులో బీరు, డిస్టిలరీస్ పరిశ్రమల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పలు కీలక తీర్మానాలను ఆమోదించారు. అక్టోబర్ 8న దేశవ్యాప్తంగా "కోర్కెల దినం" నిర్వహించి కార్మికుల డిమాండ్ల సాధన కోసం ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. అలాగే అన్ని రాష్ట్రాల్లోని సీఐటీయూ అనుబంధ యూనియన్లను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఆల్ ఇండియా కో-ఆర్డినేషన్ కమిటీని మరింత బలోపేతం చేయాలని తీర్మానించారు.ఆగస్టు 10 వరకు గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు, కరపత్రాల పంపిణీ, గ్రూప్ సమావేశాలు నిర్వహించాలని, అదే రోజు జరిగే "జైల్ భరో" కార్యక్రమాన్ని కార్మికులు, రైతులు, యువత, మహిళలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సాయిబాబు పిలుపునిచ్చారు.ఈ సదస్సులో కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ బీరం మల్లేశం, కో-కన్వీనర్ అజయ్ భావల్కర్, ధనంజయ, అశోకన్, బాగారెడ్డి, సమాధానం, కృష్ణగౌడ్, ప్రసన్నరావు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ కల్చర్ గొప్పది



కొద్దిరోజుల క్రితం సంచలనంగా మారిన ఇడుపుకాగితం ఇష్యూపై నటుడు నరేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ అంటే తాగుడు, ఆంధ్రా అంటే భోజనం కాదని అన్నారు. ప్రతి ప్రాంతంలో వారి ఆచారవ్యవహారాలు, వారి కల్చర్ గొప్పదేనని చెప్పారు. మాండలికాలు ఎన్ని ఉన్నా మనం మాట్లాడే భాష తెలుగే అని అన్నారు. తీసేవి కూడా తెలుగు సినిమాలేనని చెప్పారు. ఎవరో ఒకరు ట్విట్టర్ లో పెట్టిన పోస్టులను పట్టించుకోవద్దని వ్యాఖ్యానించారు. తెలంగాణలో తెలిసిన వ్యక్తి చనిపోతే వెళ్లినప్పుడు అక్కడ డ్రింక్స్ తీసుకోవడం చర్డీసి షాక్ అయ్యానని చెప్పారు.

అలా డ్రింక్స్ తీసుకుంటూ చనిపోయిన వ్యక్తి మిత్రుడు అయినా, శత్రువు అని ఆయన గురించి మనసుతో మాట్లాడతారని అన్నారు. ఏ కల్చర్ అయినా దానికదే గొప్పదని తెలిపారు. తెలంగాణ కల్చర్ చాలా గొప్పదని చాలా సందర్భాల్లో అనిపించిందన్నారు. ఆంధ్రా, తెలంగాణ, రాయలసీమ దేని కర్చర్ దానిదేనని అన్నారు. ఇడుపుకాగితం ఇష్యూ జరిగినప్పుడు చాలా బాధపడ్డానని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే కొద్దిరోజుల క్రితం ఇడుపుకాగితం సినిమా టైటిల్ పై తీవ్ర వివాదం నెలకొంది. కొందరు సినిమా టైటిల్ అర్థం కావడంలేదని, సినిమాను సబ్ టైటిల్స్ వేసుకుని చూడాలా అంటూ కామెంట్స్ చేశారు. ఈ కామెంట్స్ పై తెలంగాణ ప్రాంతం నుండి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. కవులు కళాకారులు ఈ కామెంట్స్ ను ఖండించారు.

# చిరు-నాగ్ కాంబో ఫిక్సా


ఒక హీరో నటించిన చిత్రాలతో పోలిస్తే మల్టీస్టారర్ సినిమాలకు సహజంగానే ఎక్కువ క్రేజ్ ఉంటుంది. ఇటీవల కాలంలో తెలుగు సినీ పరిశ్రమలో మల్టీస్టారర్ చిత్రాల సంఖ్య కూడా భారీగానే పెరిగింది. ఈ ఏడాది సంక్రాంతికి చిరంజీవి, వెంకటేష్ కలిసి నటించిన 'శంకర వరప్రసాద్ గారు' చిత్రం మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రస్తుతం దర్శకుడు అనిల్ రావిపూడి, వెంకటేష్, కళ్యాణ్ రామ్ హీరోలుగా మరో మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా విడుదల చేయనున్నారు.

ఇదిలా ఉంటే, తెలుగు సినీ పరిశ్రమలో మరో క్రేజీ మల్టీస్టారర్ తెరకెక్కే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. మెగాస్టార్ చిరంజీవి, అక్కినేని నాగార్జున హీరోలుగా ఓ భారీ మల్టీస్టారర్ చిత్రం రూపొందే అవకాశం ఉందని, దీనికి స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహించే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఈ వార్త నిజమైతే తెలుగు సినీ పరిశ్రమలో ఇది అత్యంత క్రేజీ మల్టీస్టారర్ ప్రాజెక్టలలో ఒకటిగా నిలిచే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




# 'రామాయణ' ట్రైలర్ బీభత్సం

బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణుడిగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ'. ఈ సినిమా ప్రకటించిన నాటి నుంచే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల మేకర్స్ విడుదల చేసిన ట్రైలర్‌కు అన్ని భాషల్లోనూ విశేష స్పందన లభిస్తోంది. తాజాగా చిత్ర బృందం వెల్లడించిన వివరాల ప్రకారం, 'రామాయణ' ట్రైలర్ అన్ని భాషల్లో కలిపి 350 మిలియన్ల వ్యూస్ దాటింది. దీంతో విడుదలకు ముందే ఈ చిత్రం అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం ఈ ట్రైలర్ యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో కొనసాగుతోంది. నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రాన్ని నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో రూపొందుతున్న ఈ సినిమాకు డీఎన్ఈజీ విజువల్ ఎఫెక్ట్స్ అందిస్తుండగా, ఏ.ఆర్. రెహమాన్, హన్స్ జిమ్మర్ సంగీతం సమకూరుస్తున్నారు. సన్నీ డియోల్, రవి దూబే, అరుణ్ గోవిల్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'రామాయణ' పార్ట్-1ను 2026 దీపావళికి, పార్ట్-2ను 2027 దీపావళికి విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది. ట్రైలర్‌కు లభిస్తున్న అద్భుత స్పందనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.




# మౌళీకి వెరైటీ టైటిల్




ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ మరో ఆసక్తికరమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల 'లిటిల్ హార్ట్స్' సినిమాతో విజయాన్ని అందుకున్న యువ నటుడు మౌళి తనూజ్ ప్రశాంత్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'దొంగ నా కొడకా' అనే వినూత్నమైన టైటిల్‌ను ఖరారు చేసినట్టు తెలుస్తుంది.. ఈ చిత్రానికి నూతన దర్శకుడు శ్రీను కంబాల దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ చివరి దశకు చేరుకున్న ఈ మూవీని క్రైమ్ కామెడీ జానర్‌లో తెరకెక్కిస్తున్నారు. వినోదంతో పాటు థ్రిల్లింగ్ అంశాలను కలగలిపిన కథతో ప్రేక్షకులను ఆకట్టుకునేలా దర్శకుడు శ్రీను కంబాల ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. కథలో వచ్చే ట్విస్టులు, కామెడీ ట్రాక్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ సినిమాకు సంబంధించిన టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కళాశాలలో ఘనంగా ఆవిష్కరించేందుకు మేకర్స్ సిద్ధమయ్యారు. యువతను ప్రధాన లక్ష్యంగా చేసుకుని ఈ ఈవెంట్‌ను నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. టైటిల్ ప్రకటించకముందే సినిమా గురించి ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చ జరుగుతుండగా, ఇప్పుడు 'దొంగ నా కొడకా' అనే టైటిల్ ప్రేక్షకుల్లో మరింత క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ చిత్రంలో సుష్మితా షెన్ కథానాయికగా నటిస్తోంది. హీరో-హీరోయిన్ల మధ్య వచ్చే వినోదభరితమైన సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని సమాచారం. సినిమాటోగ్రాఫర్ సూర్య బాలాజీ తన కెమెరాతో చిత్రానికి ప్రత్యేక విజువల్ టోన్ అందిస్తున్నట్లు తెలుస్తోంది.




# 'వారణాసి' షూట్ చివరి దశలో

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్‌స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్లోబల్ ప్రాజెక్ట్ 'వారణాసి'. దుర్గా ఆర్ట్స్ బ్యానర్ పై అత్యంత భారీ బడ్జెట్ పై తెరకెక్కిస్తున్నారు. అయితే ఈ సినిమా షూటింగ్‌ను జెట్ స్పీడ్ చేసేస్తున్నాడు రాజమౌళి. తాజా అప్‌డేట్. రాజమౌళి తన పక్కా ముందస్తు ప్రణాళికతో ఈ సినిమాకు సంబంధించిన మేజర్ షూటింగ్ పార్ట్‌ను ఇప్పటికే విజయవంతంగా పూర్తి చేశారు.

ప్రధానమైన యాక్షన్ సీక్వెన్స్ మరియు కీలక సన్నివేశాల చిత్రీకరణ దాదాపు పూర్తయినట్లు సమాచారం. వచ్చే వారం నుంచి హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో లేటెస్ట్ షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఈ షెడ్యూల్‌లో మహేష్ బాబుతో పాటు ఇతర ప్రధాన తారాగణంపైన కొన్ని ముఖ్యమైన టాకీ పార్ట్ సన్నివేశాలను తెరకెక్కించనున్నారు. రాజమౌళి విజువల్ వండర్‌గా రాబోతున్న ఈ పాన్-వరల్డ్ అడ్వెంచర్ డ్రామా టోటల్ షూటింగ్ ఈ ఏడాది అక్టోబర్ నాటికి ముగియనుంది. అక్టోబర్ నాటికి చిత్రీకరణ పూర్తయితే మిగిలిన సమయాన్ని పోస్ట్-ప్రొడక్షన్, విస్తృతమైన వీఎఫ్ఎక్స్, గ్రాఫిక్స్ పనులకు కేటాయించనున్నారు. ఇప్పటికే చిత్ర యూనిట్ ప్రకటించినట్లుగానే ఈ విజువల్ స్పెక్టాకిల్ 7ఏప్రిల్ 2027లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రపంచ రికార్డులను తిరగరాస్తుందో చూడాలి.

# కిరణ్ కోసం మాస్ స్కెచ్!

టాలీవుడ్ యువ నటుడు కిరణ్ అబ్బవరం తాజాగా 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంతో ప్రేక్షకులను పలకరించి మంచి విజయాన్ని అందుకున్నారు. ఇటీవల ఈ సినిమా రూ.50 కోట్ల గ్రాస్ మార్క్‌ను అందుకోవడంతో చిత్రబృందం విజయోత్సవ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సినిమా సహ నిర్మాత ధీరజ్ మొగిలినేని చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం ఆసక్తికరంగా మారాయి. ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ.. కిరణ్ అబ్బవరంతో 'చెన్నై లవ్ స్టోరీ' లాంటి క్లాస్ సినిమా చేసి మంచి విజయాన్ని అందుకున్నాం. ఇక ఆయనతో ఫ్యాక్షన్ నేపథ్యంలో ఓ పవర్‌ఫుల్ మాస్ యాక్షన్ సినిమా చేయాలనే కోరిక ఉంది.



కొన్ని రోజుల క్రితం ఆయన నిర్మాతగా వ్యవహరించిన 'తిమ్మరాజు పల్లి టీవీ' సినిమా ఈవెంట్‌కు తెల్ల చొక్కా, తెల్ల ప్యాంటుతో వచ్చారు. ఆ లుక్ ఇప్పటికీ నా మదిలో మెదులుతూనే ఉంది. అలాంటి గెటప్‌లో కిరణ్ అబ్బవరంతో ఓ భారీ ఫ్యాక్షన్ సినిమా చేయాలని అనుకుంటున్నానని తెలిపారుధీరజ్ చేసిన ఈ వ్యాఖ్యలతో కిరణ్ అబ్బవరం – – ధీరజ్ మొగిలినేని కాంబినేషన్‌లో నిజంగానే ఓ మాస్ ఫ్యాక్షన్ సినిమా తెరకెక్కుతుందా? అనే చర్చ సినీ వర్గాల్లో మొదలైంది. కాగా, 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంలో శ్రీ గౌరీ ప్రియ కథానాయికగా నటించగా, రవి నంబూరి దర్శకత్వం వహించారు. సాయి రాజేష్, ఎస్‌కేఎన్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించగా, మణిశర్మ సంగీతం అందించారు.

Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.